# 23

# సుశీల

## వైరుధ్యాలు

ఆకురాలు కాలం అపుడే ముగిసిపోయిట్టుంది. రాలిన ఆకులు గాలికి గలగలమని యింకా సవ్వడి చేస్తూనే వున్నాయి. వసంతం వస్తోంది. కొత్త చిగుళ్ళు వేస్తూ ప్రకృతి మళ్ళీ కళకళలాడేందుకు పచ్చ బారుతోంది. వసంతంతో పాటు వేసవీ పరుగు పరుగున పరిగెత్తుకుంటూ వస్తోంది - మనిషి వెంట నీడలా.

అలాంటి వేసవికాలంలో అది ఒక వెన్నెల రాత్రి. వసంత కాలమేఘ ఘర్జన తెచ్చే వర్షాలు ఉరుములు మెరుపులు, పిడుగులు ఆసన్నమవుతున్న సమయం. అది పంటకు మరో తడినే అందిస్తుందో పంటకొచ్చిన మడిని మట్టిలో కలిపేస్తుందో యింకా తెలియని సందిగ్ధ సమయం. అది ఒక సుప్రభాత పూర్వా సందిగ్ధ రాత్రి సమయం. ఆరుబయట హాయిగా నిద్రపోతున్న సుశీలకు హఠాత్తుగా మెలుకువొచ్చింది. పాతికేళ్ళ వయస్సులో పచ్చని చెట్టులా కళకళ్ళాడుతున్న సుశీల పిల్లగాలికి కదిలే లేత ఆకులా మెల్లగా సవ్వడి లేకుండా పసిపాప పక్కనించి కదిలి అటుకేసి చూసి వాళ్ళాయన్ని గోముగా పలకరించింది.

"ఔ!"

"ఊఁ!"

"ఇంకా నిద్రవోలేదేంది? టైమెంతయింది?"

"రెండు"

"రెండా?!" ఆశ్చర్యపోయింది సుశీల. పాపకు పాలిస్తూ కాసేపు ఒరిగితే అటే కన్నంటుకుంది. మళ్ళీ యిదే మెలుకువ రావడం.

"మరి పండుకోలేదేంది యింకా"

"నిద్రొత్తలేదు"

"గిట్ల నా మంచంలకు రా. జోకొడ్త" చిలిపిగా పిలిచింది.

వాళ్ళాయన భూమయ్య పెదవి విప్పలేదు.

"ఏంది గీ నడుమ అంతెట్లనో జేస్తున్నవ్?" సుశీల మనస్సు చిన్నబోయింది. ఆడవాళ్ళు అడిగి కాదనిపించుకుంటే ఆ బాధ వర్ణనాతీతం. అది వారిని ఇన్ఫీరియారిటీలోకి ఈడ్చుకు పోతుంది. అయినా అతను మౌనంగానే వుండిపోయాడు.

ఇక దూరం నుంచి లాభం లేదనుకుని రొమ్ము కరుచుకుని అలాగే నిద్రపోయిన పాపని కొంచెం జరిపి జోకొట్టి భర్త మంచం చేరింది సుశీల.

భూమయ్య నడిమంచంలో పడుకొని ఆకాశం కేసి చూస్తున్నట్టున్నాడు. కానీ ఆకాశం కేసి చూడ్డం లేదు. కళ్ళు మూసుకొని ఏదో ఆలోచిస్తున్నాడు. సుశీల ఒరగడానికి ఏ పక్కనా స్థలం లేదు. భర్త కేసి ఎగాదిగా చూసింది. కదిలే సూచనలు కనపడలేదు.

"జరుగు" అంటూ భర్తని తోస్తూ పక్కన ఒరిగింది సుశీల. భర్త నడుంపై చేయి వేసింది. చీమ పారినట్టయినా కదలల్లేదు భూమయ్య. చూసి చూసి విసిగిపోయింది సుశీల. తన ఉనికినైనా గమనించకపోయేసరికి మనస్సు చివుక్కుమంది. అది మనస్సులోనే దాచుకొని మళ్ళీ పలకరించింది.

"ఇటునాకెయి తిరుగు, కండ్లు తెరువు. ఓసారి నాకెయి చూసి మాట్లాడు."

ఆ మనిషి మాట్లాడలేదు.

ఆఖరుకు నోరువిడిచి అడిగింది సుశీల.

"గిట్ల నీ పక్కకొచ్చి పంటెగూడ నీకేమనిపిస్త లేదా?"

ఇప్పుడామె కళ్ళల్లో కోరిక లేదు. ఏదో కోల్పోతున్నట్టుంది చూపు. కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. గొంతు జీరగా పలికింది.

"నువ్వు నన్ను కొట్టుడుబందు జేసింది గిందుకేనా? నీ కాళ్లు మొక్కుతా నువ్వు నన్ను మనుపటోలె కొట్టు, తిట్టుకని మాట్లాడు."

అయినా అదే మౌనం.

"ఏంది ఏమ్మాట్లాడవు? ఇన్నేండ్ల సంసారంల నిన్నెన్నడన్న కష్టపెట్టిన్నా! నిన్ను

మీ యూనియన్ల తిరగద్దు. నౌకరి పోతదని అడ్డం తిరిగిన్నా ఎన్నడన్నా?" కళ్ళనీళ్ళతో అడిగింది సుశీల.

"సాతనైత లేదు, ఇయ్యాల్ల డ్యూటీకోను". అంటే "పో..పో" అని గిట్ల అన్ననా?.... జీతం పైసలు సగం యూనియన్ తిరుగుల్లకే ఎందుకు పాడు జేస్తున్నవ్ అని, నాకు మంచి చీరెలు కొనుమని ఎన్నడన్నా రంపం (పోరు) బెట్టిన్నా? రెన్నెల్లు పని బందువెడ్తిరి. గిట్లెందుకు జేస్తరు అన్ననా! వచ్చినకాడికి సాలన్ననా? మేం ఆడోల్లం గూడ మద్దతు నిలవడలేదా?"

"..........."

"ఏంది మాట్లాడవు? నువ్వు డ్యూటీకి పోక కాల్లు గుంజు తున్నయని అంటే తలకు తానం బోసిన్నా, లేక నిన్నిడిసి సినిమాలు జూడవోయిన్నా? నీ మాటగాదని నేను ఎన్నడన్న తల్లిగారింటికి పోయిన్నా? నువ్వు గిట్లెందుకు జేస్తున్నవ్? నా మీద నీకు మనసెందు కిరిగిందో చెప్పు"

పచ్చని చెట్టులాంటి సుశీల కన్నీళ్ళు కారుస్తోంది.

భూమయ్య మాట్లాడలేదు. అతని మనస్సిక్కడ లేదు. అది ఏదేదో తలపోస్తోంది.

❄ ❄ ❄

అసలు ఈ సృష్టికి అర్థం ఏమిటి? ఈ నిరంతర చలనానికి పరమార్థం ఏమిటి? ఈ జీవుడి జన్మకు కారణం ఏమిటి? సార్థకత ఏమిటి? ఈ జీవుడు నిరంతరం పుడ్తూనే వున్నాడు. దిన దినం ఎదిగి గిడుతూనే వున్నాడు. ఈ జీవి పోతూ పోతూ మరింత అభివృద్ధి కరంగా తన వారసుల్ని వదిలిపోతూనే వుంది.

అలా అందరిలా కోట్లలో ఒకడుగా తాను పుట్టాడు. యవ్వనంలో అడుగుపెట్టాడు. పెళ్ళీ అయిపోయింది. అపుడే పిల్లలు పుట్టేసారు. నిన్న భార్య, నేడు పిల్లలు, రేపు ముసలితనం, ఎల్లుండి ఏమిటి! చావు! ఓస్! బతుకంతా యింతేనా? చావు పుట్టుకల మధ్య గల ఈ జన్మకు సార్థకత ఏమిటి? ఈ జీవన సంఘర్షణ ఏమిటి? ఈ సమాజానికి ప్రకృతికి సంబంధం ఏమిటి? సంఘర్షణ ఏమిటి?

అదేమిటి? వీటి అర్థాలూ అంతరార్థాలూ తెలుసుకోక ముందే తనని కూలీగా మార్చిందెవడు? ఆకలా?

ఈ ఆకలి, ఆహార అన్వేషణలో పూర్వం మనుషులు పుడమితల్లి చుట్టూరా ఎంత స్వేచ్ఛగా తిరిగారో! ఈ ఆకలి యాత్ర ఎంత నిరంతరంగా సాగుతోంది!

అదేమిటి? ఆ ఏడుపు ఎక్కడినించి?

కళ్ళు తెరిచాడు భూమయ్య. సుశీల కన్నీళ్ళతో అతని భుజం తడిసి పోయినట్టుంది. సుశీల వెక్కి వెక్కి ఏడుస్తోంది.

భూమయ్య మనస్సు వికలమైపోయింది. చలికి వణికిపోయే పసిపాపలా కాళ్ళు చేతులు ముడుచుకొని ఏడుస్తోంది సుశీల. ఎలా ఓదార్చాలో ఏమని ఓదార్చాలో, కొంతసేపు తెలిసి రాలేదు. తేరుకున్నాక అనునయించాడు.

తన కన్నీళ్ళు తుడుస్తాడేమోనని సుశీల ఆశగా అలాగే వెక్కుతోంది. భూమయ్యకు అది తట్టినట్టు లేదు.

"పిసదానా ఎందుకేడుస్తున్నవే? ఏమైందని?"

"మరిగిట్లెందుకు జేస్తున్నవో చెప్పు" వెక్కుతూనే అంది సుశీల.

"ఏం జేస్తున్ననే? మంచిగనే వున్న గదనే?"

"మరి నా మీద నీకు మనసెందుకిరిగిందో సెప్పు"

"ఛా. గదేం మాటనే?"

"మరెందుకు గిట్లజేస్తున్నవ్? పక్కకచ్చి పంటెగూడ నన్ను పరాయి మనిషి తీర్గ జూస్తున్నవ్" కుమిలి కుమిలి ఏడుస్తోంది సుశీల. లాలనగా సుశీల కళ్ళు తుడిచాడు భూమయ్య.

"ఒక్కసారి దగ్గరికి తీస్కోకుంటే గింత కోపమాయె?"

"కాదు. నీ చూపులు మునుపటి తీర్గ లేవు. నువ్వు నన్నిడిసిపెట్టి ఎటో పోతున్నట్టనిపిస్తన్నయి. ఎందుకు గిట్ల జేస్తున్నవ్? పోలీసోల్లచ్చి నీకు చెప్పక ఎక్కడికి పోతడే అని కొడ్తె గూడ నువ్వు జెయ్యవట్టే గివన్ని కట్టాలు అని నిన్నెప్పుడన్నా తిట్టిన్నా?"

"ఊహుం!"

"మరి జైలుకు పోయ్యచ్చిన కాన్నుంచి గిట్లెందుకు జేత్తన్నవ్? నువ్వు పదినెల్లు జేల్లుంటే ఈ సంసారం ఏ ధైర్యంతోటి ఏగిచ్చిన? నీ నౌకరి నీకు మల్ల అచ్చేదాక ఎటు తిరుగకు. నేనే ఏదన్న కైకిలి జేసి యిల్లు సగవెడ్త. నువు నా కండ్లముంగటుండాలె నన్ను గిట్ల చూపుల్తోటి దూరం గొట్టద్దు." బేలగా అంది సుశీల.

"ఎట్లనే?" నవ్వాడు భూమయ్య.

"గిదేంది? మునుపు గిట్లనే వున్నవా! గిట్లెందుకు దూరం గొడుతున్నవ్!"

"ఛా పిసదానా! నువ్వంటే నాకెంత ప్రేమనే. నీకు మాత్రం తెల్వదానే?" భూమయ్యకు జైల్లో ఏదో చదివిందో, విన్నదో అమలిన శృంగారం మనో ప్రేయసి భావకవిత్వం గుర్తొచ్చినట్టు మళ్ళీ అన్నాడు.

"మనం గిట్ల కల్సుకోకపోతే యిగ మనం పెండ్లాం మొగలం కానే కామా? మన నడుమ యిగ వేరే అనుబంధం లేనే లేదాయె?"

"గట్లయితే మరి నన్నెందుకు చేసుకున్నవ్? దూరం నుంచి చూస్తే సాలదా?"

"అది పోనీగని, నేనొకటి అడుగుత చెప్పే."

"వూం!" అది గాదే! ఇద్దరు పోరగాన్లయినంక మొగడు ఏదన్నయి చచ్చిపోతడనుకో. వాల్లంత ఎట్ల బతుకుతరే?"

"పిల్లగాన్లను చూసుకుంట?"

"గిట్లదుక్కమచ్చినపుడు నేను నీకు దగ్గరుంటి. మరి వాల్లకెవలున్నరే?"

"అంటే! నన్ను గూడ ముండబొడ్డిని చేద్దామనుకుంటున్నవ?"

"అదిగాదే! మస్కట్, దుబాయికి,బొంబైకి పోయినోల్లు యాడాది రెండేండ్లదాకా యింటికి రారు. వాల్లంత ఎట్లనే!"

"అంటే? నువ్వు వాల్లండ్ల కలుస్తవా?"

"అదిగాదే మన కష్టాలు కడతేరాలని యూనియన్ మొదలెట్టినం. పోయినయా"

"........."

"ఏం మాట్లాడవేమే. కష్టాలు ఏక్వ అయినయా! తక్వ అయినయా?"

"ఎక్వనే అయినై"

"ఎట్లనే?"

"పోలీసులచ్చిరి. సర్కారు దిగింది. నౌకర్లు దీసిన్రు"

"మరి మన పల్లెల దొరల జులుం పోవాలన్నరు, ఏమైందే?"

"అక్కడ గిట్లనే జేసిరి."

"గిట్ల ఎవలు ఏదడిగిన సర్కారు ఏంజేత్తందే? కోర్టులు, జైల్లు, రిట్రెంచిమెంటులు, కని మన సమస్యలు తగ్గినయా?"

"గందుకే ఏది పట్టిచ్చుకోవద్దు యిగ. పురుగు, బూసిదిని పుట్టలుందాం."

"గట్లయితే సమస్యలు ఎక్కడ పరిష్కారమైతయే? 'నువ్వు' గూడా నా యెంట రాయే అని చెప్పుదామని గివన్ని చెప్తే నువ్వు నన్ను గూడ వద్దనవట్టివేందే?"

"నాకు సాతగాదు. ఈ పసిపోరగాన్లను యిడ్సిపెట్టి ఎటనివస్తరు? ఎట్లనివస్తరు? అయినా నువ్వెటుపోతే అటు నేనెందుకు రావాలె అసలు.... నీతోటి సంసారం చెయ్యకపోతే ఎవలతోటన్న అనిపియ్యి. సన్నాసుల తీర్గ తిరుగుదామంటే కుదురుతదా ? లగ్గం జేసుకున్నది గిందుకేనా?"

"అగోగట్లంటవేమ్మే? పతియే ప్రత్యక్షదైవంగాదే! నీ మొగని తోని నువ్వుండవాయె? ఎవల మొగుని దగ్గరికి వాల్లు పోతలేరానే?" నవ్వాడు భూమయ్య.

"వాల్లు నౌకరి మీద పోతన్రు. ఇదే మన్న నౌకరా? ఉన్న నౌకరి ఊడగొట్టుకునుడయిపోయె....."

"ఛా. గా పిచ్చకుంట్ల నౌకరసుంటి దానికోసమైతే ఎంబడి వస్తనంటవ్? కని యిది అంతకన్న గొప్పదే?"

"ఎట్ల గొప్ప? నీ పోరగాన్ల బతుకులు ఏగిచేసుకుంట నీ యిష్టం వచ్చినట్టు తిరుగుడు ఎట్ల గొప్ప? నేను రాను. నీ గొప్పతనం నీ దగ్గర్నే వుంచుకో...."

"మరెట్లంటవే?"

"ఎట్లలేదు. నువ్వు నాతోనే వుండాలె."

"మందు తెలిసిన డాక్టరు ఎవలదన్న పానం బోంగ సూడమంటవా? అట్ల ఉత్తగ కూసుంటె ఆ పాపం ఎవలదే?"

"మరినీ పోరగాన్ల గోస నీకు తగలదా?"

"వీల్లకోసమే గాదే? యిదంతా చేస్తున్నది?" అంటూ నవ్వాడు భూమయ్య.

"అవ్వల్ల ఎవలన్న ఇంటే మానంబోతది. నువ్వు పోరగాండ్లను యిడిసిపెట్టి, నౌకరి యిడిసి పెట్టి ఎటుపడితే అటు దిరుగుడు పోరగాన్ల కోసమా?"

"తర్వాత తర్వాత సుకంగ బతికేది వీల్లేగాదే!"

"రేపటికి రూపంలేదట, రేపటి యాల్లను ఎవలు జూడవోయిన్రు. యిగురం చెప్పు యీరవ్వా అంటే, వీన్నిడిసి యింకోన్ని పట్టు అన్నట్టున్నది నీ యవారం. యింకోన్నిపడ్తే వాడేదో సక్కనోడైతడన్నట్టు".

"రేపటికి రూపం లేదంటవు. మరి నువ్వు మన యింటికాడ వేపచెట్టు రాగిచెట్టు పెట్టి కంపనాటితివి. ఎందుకే? అని పెరిగి నీకే నీడనిస్తయని నమ్మే పెట్టినావే?

"నాకియ్యకపోతే నా పోరగాన్లకు నీడనిస్తయి."

"నేను చేసేది గూడ గట్లని ఎందుకనుకోవే?"

"ఇగో గవన్ని జెప్పకు నాకు. నువ్వు ఎవలతోని కొట్లాటకు దిగకు. నువ్వు నాకండ్ల ముంగట వుండాలె. నా పసుపు కుంకుమ నాకుండాలె".

"గట్లజెప్పు. పానం బోవుడంటావె? వానియవ్వ! ఆక్సిడెంట్లల్ల రోజూ ఎంతమంది చస్తలేరే? నీకు తెల్వదా ఏందే? అదీగాక పుట్టినంక ఎన్నడో ఒకనాడు సావైతే తప్పది గదనే?"

"గట్లని యిప్పుడే ఏ బాయిల్లో పడి చావుమంటవా మరి?"

"ఛీ. గవేం మాటలే."

"నువ్వు జెప్పింది నీకే జెప్పిన"

"మరి ఎట్లనే?"

"ఎట్లా? యిగో గీ పిలగాన్లతోటి గిట్లనే కలిసి వుండాలె?"

"గట్లయితే ఎట్లనే? యిగమరి యీ సమాజాన్ని మార్చుడెట్లనే?"

"గవన్ని నాకు తెలువయి. గీల్లను సాదుకుంట ఏమన్న చెయి. కని నా కండ్లముంగట వుండాలె."

గాలి చల్లగా వీస్తోంది. అది వారి శరీరాలకూ చలచల్లగా సోకుతూ వెళ్తోంది. ఏదో పాకినట్టయి ఉలిక్కిపడిన పాప కెవ్వుమంది. భర్త మంచం వదిలి మళ్ళీ తన మంచం చేరింది సుశీల. పాలు యిస్తూ యిస్తూ అలానే కన్నంటు కున్నట్టుంది. నిద్రపోతోంది సుశీల.

నిశ్చలంగా కన్పించే పుడమితల్లి యిరవై రెండువేల మైళ్ళవేగంతో పరిగెడుతోంది. అచేతనంగా పడివున్నట్టు కన్పించే ప్రకృతి ఎంతో వేగంగా శ్వాసిస్తోంది. నిద్రిస్తున్నట్లు కనిపించే ఆ యిద్దరిలో ఆలోచనలు వేగంగా సాగుతున్నాయి. ఆ యిద్దరి ఆలోచనలూ ఒకేదాని యొక్క రెండు అంశాలు. అవి నిరంతరం ఐక్యంగా ఘర్షిస్తూనే వుంటాయి.

వెలుగురేఖలు పడి ఉలిక్కిపడి లేచింది సుశీల. భూమయ్య మంచం ఖాళీగా కన్పిస్తోంది. గాభరాగా అటూ ఇటూ చూసింది.

కొంతసేపటికి దొడ్డికి  పోయిన భూమయ్య ఖాళీ ముంతతో నవ్వుతూ యింటికేసి వచ్చాడు.

సుశీల ఆందోళన తగ్గి నవ్వింది. అయినా లోపల ఏదో గాభరాతో సతమత మౌతూ ఇంటిపనిలో పడింది.

ఈ నిరంతర అనిశ్చిత స్థితి యింకెన్నాళ్ళు? అవి ఒక వైరుధ్యం యొక్క రెండంశాలు. అని పరస్పరం మాత్రమే ఉనికిలోకి ఉంటాయి. ఒకటి అదృశ్యం అయితే రెండోది అదృశ్యం అవుతుంది. అలా అవి మరో కొత్త ఉనికిలోకి మారిపోతాయి. అందువల్ల అది అనిశ్చిత స్థితి కాదు. అది నిరంతర చలన స్థితి. అందుకే వైరుధ్యానికి అంతం లేదు. ఈ కథకు ముగింపు లేదు.

**కథాకాలం 1983-84, రచనా కాలం - 1986.**
**'వైరుధ్యాలు' పేరుతో ఆగస్టు 15, 1990 - నలుపు పక్షపత్రిక**